## పట్టణ వార్డులల్లో ప్రత్యేక వార్డ్ సభలు

### మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి



భీమ్ గల్, బతుకమ్మ :ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణలోని వార్డ్ లల్లో ప్రత్యేక వార్డ్ సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి అన్నారు. అందులో భాగంగా గురువారం పట్టణంలోని 2,10 వార్డులలో నిర్వహించిన ప్రత్యేక వార్డ్ సభల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించిన అనేక అంశాలను ప్రజలకు వివరిస్తు రాబోయ్యే వర్షాకాలం సన్నద్ధత, ప్రజలు డెంగ్యూ మలేరియా బరిన పడకుండా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సురక్షిత తాగునీరు త్రాగాలని, తడి-పొడి చెత్త సేకరణ గురించి ప్రజలకు అవగాహన కలిగించి, పలు సూచనలు చేశారు. ఈ యొక్క వర్షాకాలములో ప్రతి ఒక్కరు మొక్కలు నాటావాలేనని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ గజానంద్ మాటాడుతూ పట్టణంలో 4 నుండి 10 వ తేదీ వరకు నాలుగు రోజులు వార్డ్ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మిగితా మూడు రోజులు ఈనెల 6న 3,4,5, 6వార్డ్ లల్లో ఈనెల 8న 7,9,11 వార్డ్ లల్లో, ఈనెల 10న 1, 8, 12 వార్డ్ లల్లో వార్డ్ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రములో వివిధ శాఖల అధికారులు వారి యొక్క ప్రగతి ప్రణాళికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ చైర్ పర్సన్ శ్రీమతి సంటిలత నర్సయ్య, కౌన్సిలర్ పర్స కుశలత అనంతరావు, వివిధ శాఖల అధికారులు,మహిళా సంఘ సభ్యులు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ క్రైం, బతుకమ్మనిజామాబాద్ నగరంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. నగరంలోని ఖలీల్వాడిలో ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్న నర్సింగ్ విద్యార్థిని (19) హాస్టల్ గదిలోనే నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. తోటి విద్యార్థులు విద్యార్థినిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి వేధింపులే కారణమని తెలిసింది. విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయం పై నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్ వివరణ కోరగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నం వాస్తవమేనని చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థిని కోలుకున్న తర్వాత వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

## నిర్లక్ష్యం నీడన గ్రామసభలు

### గ్రామసభలలో పాల్గొననీ అధికారులు

### సమస్యలు ఎవరికి చెప్పుకోవాలననీ

### అయోమయంలో ప్రజలు

పిట్లం, బతుకమ్మ :ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన గ్రామసభలలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన గ్రామసభల్లో మండల స్థాయి అధికారులు పాల్గొనకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం ప్రజల ఆశలను నీరుగారిచే విధంగా కనబడుతోందని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. పిట్లం మండలంలో గురువారం నాడు ఎనిమిది గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాలలో గల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రామసభలకు అధికారులు లేకపోవడంతో వేలవేలపోయాయి. గ్రామంలో ఏర్పడిన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు వెనుతిరిగారు. గ్రామంలో గల సమస్యల గురించి ముందస్తుగానే గ్రామపంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులకు ముందస్తుగా చైతన్య పరచాలని ఉద్దేశం ఉన్నప్పటికీ దానికి వ్యతిరేకంగా గ్రామసభలు కొనసాగాయి. నిర్వహించిన గ్రామసభలు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చర్యలు చేపట్టాల్సిన అవసరం . ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



# భీమ్‌గల్ బ్రిడ్జి, బడా భీమ్‌గల్ రోడ్డును వెంటనే మరమ్మత్తు చెయ్యాలి

### బీజేపీ మండల్ ప్రెసిడెంట్ ఆరె రవీందర్

భీమ్ గల్, బతుకమ్మ :గత వర్షాకాలం కురిసిన భారీ వర్షాల కారణంగా వరద తాకిడికి కొట్టుకుపోయిన భీమ్ గల్ బ్రిడ్జ్, బడా భీమ్ గల్ ఆర్ అండ్ బి రోడ్డు ను వెంటనే మారమ్మత్తులు చేయించాలని బీజేపీ మండల్ ప్రెసిడెంట్ ఆరె రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కానిస్టెన్సీ ఇంచార్జ్ డాక్టర్. మల్లికార్జున్ రెడ్డి సూచన మేరకు గురువారం మండల బీజేపీ శాఖ, పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోయిన వానకాలం జరిగిన నష్టం మామూలు కాదు రోడ్లు పూర్తిగా ధ్వంసమై బడా భీంగల్,చెంగల్,సికింద్రపూర్, గోనుగోప్పుల గ్రామాల వారితోపాటు అనేక గ్రామాల ప్రజలు సుదూరం నుండి తిరిగి వచ్చేవారన్నారు. పంట నష్టం విపరీతంగా జరిగి, వంతెన కూడా పూర్తిగా చెడిపోయి రాకపోకలు రెండు మాసాలు లేకుండా పోయిన, భీమ్ గల్ నుండి ఆర్మూరుకు అతిపెద్ద రోడ్డు మార్గం అయినటు వంటి ఈ రోడ్డు చెడిపోవడం ద్వారా చాలా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. 10 నెలలు గడుస్తున్న కనీసం ఇప్పటివరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరిస్తున్నా మన్నారు. బాల్కొండ నియోజక వర్గంలో ప్రభుత్వానికి సంబంధిం చిన పెద్ద పదవులు అనుభవిస్తున్న నాయకులు భీమ్ గల్ కు రావాలం టే ఇదే రోడ్డు మార్గం గుండా రావాలి అయినా మీ కండ్లకు ఈ చెడిపోయిన రోడ్డు, బ్రిడ్జ్ కనిపించ డం లేదా అని ఆయన ప్రశ్నించా రు. ప్రభుత్వంలోని పెద్దలు గ్రూపులు నాలుగు చేసుకుని మరి వాగు నుండి ఇసుక తోడేసుకుని అమ్మేసుకొని వాటాలేసు కుని పంచుకుంటున్నారే కానీ ఆ వాగు పైన ఉన్న బ్రిడ్జి పరిస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పది నెలలు గడిచిన బిజెపి నాయకులమైన మేము ఎన్నిసార్లు ప్రశ్నించిన పట్టించుకున్న పాపాన పోవడం లేదని, దీనికి కాంగ్రెస్ నాయకులు తగిన మూల్యం మీరు చెల్లించక తప్పదని, అన్ని విషయాలు ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారు. ఈ వానకాలం వచ్చె లోపు పూర్తి స్థాయిలో మరమత్తులు చేయకపోతే బాల్కొండ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ డాక్టర్



ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామనీ హెచ్చరించారు. అనంతరం స్టేట్ కౌన్సిల్ మెంబెర్ యోగేశ్వర నర్సయ్య, పట్టణ అధ్యక్షులు కనికరం మధు మాట్లాడుతూ గత సంవత్సరం బారి వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు,వంతెన మరమత్తు కు నామ మాత్రం రిపేర్లు చేస్తూ మొరం పోసీ డబ్బులు లేపుకున్నారు కానీ రోడ్ల మరమ్మత్తులు మాత్రం చేయలేదన్నారు. అను నిత్యం రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఈ మరమ్మత్తులను వెంటనే చేపట్టి పూర్తి చెయ్యాలని, లేని పక్షంలో బీజేపీ పార్టీ పోరుబాట తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాదర్,పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు నీలం గంగాదర్,మండల ఉపాధ్యక్షులు ఈర్ల మహేందర్,పార్థ సారథి,జిల్లా ఓ బీ సీ మోర్చా కార్యదర్శి చిట్టి గౌడ్,కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు తక్కూరి అంజయ్య, కొట్టాల మోహన్ మరియు పట్టణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నవీన్,బీ,జే,వై, ఎమ్,నాయకులు కొట్టాల అశోక్,మండల కార్యదర్శి రజినీకాంత్,సీనియర్ నాయకులు కాట్లే లింగం,ప్రశాంత్, హరిప్రసాద్,ఉప్పల నవీన్,యోగిని శ్రీనివాస్,పుండరీకం,భూత్ అధ్యక్షులు కార్యకర్తలు శక్తి కేంద్ర ఇన్చార్జిలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

# రెడ్డి సంఘాల ఐక్యవేదిక హైట్రిక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లవల్లి కరుణాకర్ రెడ్డి

నిజామాబాద్ ప్రతినిధి, బతుకమ్మ :రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా మూడవసారి (హైట్రిక్ ) జిల్లాకు చెందిన నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకొన్నారు.ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెడ్ల అభివృద్ధి ధ్యేయంగా రెడ్ల సంక్షేమమే లక్ష్యంగా వివిధ రూపాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు . ఆనంద రోజుల్లో కూడా ఈ నూతన కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి కార్పొరేషన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు అయ్యేంతవరకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. రాష్ట్ర కమిటీ లో వరుసగా మూడవసారి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డిల సంక్షేమం కోసం వాళ్ళ అభివృద్ధి కోసం నిరంతరం



పోరాటం సాగించామని, ఇప్పుడు కూడా తనవంతు గా పేదరెడ్డిల సంక్షేమం కోసం రెడ్డి నిరుద్యోగ యువతీ యువతుల కోసం ప్రత్యక్షంగా,పరోక్షంగా పోరాడుతానన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి చేస్తామన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ యొక్క పదవి బాధ్యతను కట్ట పెట్టినందుకు వ్యవస్థాపక



అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు నాగర్త చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సహాధ్యక్షులు నాగిరెడ్డి,లింగారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ సుమన్ రెడ్డి,బండ గోపాల్ రెడ్డి,రాజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

### ఉపాధ్యాయ ప్రజాతంత్ర సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ళ సురేష్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ప్రజాతంత్ర సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ళ సురేష్ డిమాండ్ చేశారు.
ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతి సంవత్సరం నిర్వహించడంతో పాటు అర్హత మార్కులను సరళీకరించాలని ఆయన కోరారు. గౌరవ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం 2028 ఆగస్టు 31 నాటికి ఉపాధ్యాయులందరూ ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉన్న నేపథ్యంలో, విద్యాశాఖ సంవత్సరానికి రెండుసార్లు పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. పాఠశాల సహాయ ఉపాధ్యాయుల విషయాల వారీగా పరీక్షలు నిర్వహిస్తే ప్రస్తుతం అనుత్తీర్ణులుగా ఉన్న వేలాది మంది ఉపాధ్యాయులు తొలి రెండు ప్రయత్నాల్లోనే అర్హత సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే తమిళనాడు తరహాలో సేవలో ఉన్న ఉపాధ్యాయులకు అర్హత మార్కులను నలభై శాతానికి తగ్గిస్తే మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి మానసిక ఒత్తిడి నుంచి బయటపడతారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు పన్నెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఒకే నియామక ప్రక్రియ ద్వారా ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు ప్రభుత్వ, జిల్లా పరిషత్ అనే విభజనల కారణంగా న్యాయస్థానాల చుట్టూ తిరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన అంశాలను వేగంగా పరిష్కరించి ఏకీకృత సేవా నియమాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దాదాపు ఇరవై నాలుగు సంవత్సరాలుగా ఒకే స్థాయిలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులకు ఉప జిల్లా విద్యాశాఖాధికారులుగా, పాఠశాల సహాయ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని మండలాల్లో విద్యా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల విద్యాశాఖాధికారి పదవులను రెండు స్థాయిలుగా విభజించాలని సూచించారు. అలాగే స్నాతకోత్తర విద్యతో పాటు విద్యాశాస్త్రంలో ఉన్నత అర్హతలు కలిగిన పాఠశాల సహాయ ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శిక్షణ సంస్థలలో అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఉప జిల్లా విద్యాశాఖాధికారులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థల అధ్యాపకుల ప్రత్యక్ష నియామకాల ప్రకటనకు సిద్ధమవుతోందనే సమాచారం ఉన్న నేపథ్యంలో, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు ముందుగా పదోన్నతులు ఇవ్వాలని ఆయన కోరారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హత మార్కులను నలభై శాతానికి తగ్గించే అంశంపై అన్ని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త వేదిక ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుని, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వెనిగళ్ళ సురేష్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు బయలుదేరిన జిల్లా జట్టు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న రాష్ట్రస్థాయి 11వ యూత్ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు గురువారం బయలుదేరింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల ఆధారంగా ప్రతిభావంతులైన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలింపియాడ్ పాఠశాల నుండి బర్కుంట హాసిని, వంశికలు బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు.
ఎంపికైన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్ రజి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కోచ్ అరుణ్ అభినందించారు. విశాల ఆధ్వర్యంలో క్రీడాకారుల బృందం రాష్ట్రస్థాయి పోటీలకు తరలింది. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో వివిధ జిల్లాల జట్లతో జిల్లా బృందం తలపడనుంది. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది